సాక్షి నిర్మల్

బుధవారం, 10, మే, 2023

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. పరీక్ష తప్పితే ఓడిపోయినట్లు కాదు. 8లో▸



ఆర్టీసీకి సీజన్ జోష్

శుభకార్యాల సీజన్ కావడంతో ఆర్టీసీకి కలిసివస్తోంది. బస్సుల్లో వారం రోజులుగా ప్రయాణికుల శాతం ఆక్యుపెన్సి రేషియో (ఓఆర్) పెరిగింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
40.8/27.7

వాతావరణం

ఆకాశం కొంతేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.



ఫస్టియర్‌లో 8.. సెకండియర్‌లో 9..

- ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థానాలివీ
- మొత్తంగా బాలికలదే పైచేయి
- గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు

నిర్మల్ రూరల్:ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో సెకండియర్‌లో జిల్లా రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవగా, ఫస్టియర్‌లో 8వ స్థానం సాధించింది. మొత్తంగా ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. నెల రోజుల తర్వాత ప్రభుత్వం ఫలితాలను విడుదల చేసింది. ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 62 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ విద్యార్థులు 69 శాతం పాసయ్యారు. గతేడాది 67 శాతం ఉత్తీర్ణత సాధించినా జిల్లా 16 స్థానంలో నిలిచింది. ఈసారి 9వ స్థానం సాధించింది.

సెకండియర్‌లో 69 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు 69 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 5,664 మంది విద్యార్థులకు 3,910 మంది పాసయ్యారు. ఇందులో 2,669 మంది బాలురకు 1566 మంది(58%) పాసయ్యారు. 2,995 మంది బాలికలకు 2,344 మంది(78%) ఉత్తీర్ణులయ్యారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 58గా ఉండగా, బాలికల ఉత్తీర్ణత శాతం 78గా నమోదైంది. సెకండ్ ఇయర్ ఒకేషనల్ కేటగిరీలో మొత్తం 1,076 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 639 మంది(59%) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 666 మంది పరీక్షలు రాయగా 323 మంది పాసయ్యారు. 410 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 316 మంది(77%) పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కేటగిరీలో జిల్లా రాష్ట్రంలో 30వ స్థానంలో నిలిచింది.

ప్రైవేట్ కేటగిరీలో 30% మంది పాస్..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో సెకండ్ ఇయర్ ప్రైవేట్ కేటగిరీలో జిల్లా వ్యాప్తంగా 30 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 727 మంది విద్యార్థులకు 220 మంది పాసయ్యారు. ఇందులో 529 మంది బాలురకు 156 మంది ఉత్తీర్ణులయ్యారు. 198 మంది బాలికలకు 64 మంది పాసయ్యారు. ప్రైవేట్ కేటగిరీ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది.

గతేడాది కంటే మెరుగు..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా గతేడాదికంటే మెరుగైన స్థానం సాధించింది. గత సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 61 శాతం ఫలితాలతో రాష్ట్రంలో 15 స్థానంలో నిలువగా, సెకండియర్‌లో 67% ఫలితాలతో 16వ స్థానంలో నిలిచింది. ఈసారి ఫస్టియర్‌లో 62% శాతం మార్కులతో 8వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 69% శాతం మార్కులతో 9వ స్థానం నిలిచింది.

జూన్ 4 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ..

ఇంటర్ విద్యార్థులకు జూన్ 4వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. దీనికోసం బుధవారం నుంచి 16వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రీకౌంటింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.100 చొప్పున, రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.600 చొప్పున ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. విద్యార్థులకు షార్ట్ మెమోలు tsbie. cgg. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని ప్రకటించారు.

ఫస్టియర్ ఫలితాలు ఇలా..

ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. మొత్తం 5,816 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,650 మంది(62%) పాసయ్యారు. ఇందులో 2,642 మంది బాలురకు 1,331 మంది (50%) ఉత్తీర్ణులయ్యారు. 3,174 మంది బాలికలకుగాను 2,319 మంది (73 శాతం) పాసయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో జిల్లాలో 41 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 34వ స్థానం లభించింది. మొత్తం 1,233 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 515 మంది పాసయ్యారు. ఇందులో 720 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 217 మంది(30%) ఉత్తీర్ణత సాధించారు. 513 మంది బాలికలు పరీక్షలు రాయగా 298 మంది(58%) పాస్ అయ్యారు.

జిల్లా టాపర్‌గా స్రవంతి



తల్లిదండ్రులతో స్రవంతి

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి లక్ష్మీ–మోహన్ దంపతుల రెండో కుమార్తె స్రవంతి ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. నిర్మల్ పట్టణంలోని సోఫీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్ వరకు చదివింది. మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో 1000 మార్కులకు 986 మార్కులు సాధించింది.

రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన దీక్షిత..



నాగుల దీక్షిత, విద్యార్థిని, నిర్మల్

మామడ:జిల్లా కేంద్రానికి చెందిన నాగుల దీక్షిత ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు 436 మార్కులు తెచ్చుకుని రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. జిల్లా కేంద్రంలోని డీటీనగర్‌కు చెందిన నాగుల లత –రవిగౌడ్ దంపతుల కూతురు దీక్షిత పదో తరగతి వరకు నిర్మల్‌లో చదివింది. ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. రవిగౌడ్ ముజ్గి జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఉపాధి కూలీల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలు మంగళవారం నిరసన చేపట్టారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు కాకుండా పనిచేయని వారికి సైతం డబ్బులు జమ చేస్తున్నారని ఆరోపించారు. పనులు జరిగే ప్రదేశానికి టీఏ రావడం లేదని, ఇష్టానుసారంగా కూలీలకు డబ్బులు జమ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పది గ్రూపులకు చెందిన వందమంది కూలీలుంటే, 60 మంది మాత్రమే పనులకు వస్తున్నారని తెలిపారు. మిగిలిన 40 మందికి డబ్బులు ఎలా జమ చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయమై 'సాక్షి' ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శివలింగంను వివరణ కోరగా, విచారణ జరుపుతామని తెలిపారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న శ్యాంరావ్ రాథోడ్

భైంసాటౌన్:రైతులు మూస పద్ధతి వ్యవసాయంతో నష్టపోతున్నారని, అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పాం సాగుతో దీర్ఘకాలికంగా ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్యాంరావురాథోడ్ అన్నారు. భైంసాలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ప్రీయూనిక్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇదివరకు ఆయిల్‌పాం సాగుచేసిన రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ సలహాదారు వెంకట్రాంరెడ్డి రైతులకు సాగు పద్ధతులు, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, నెటాఫిమ్ ఆగ్రోనమిస్ట్ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, భైంసా ఏడీఏ వీణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ప్రసాద్

లక్ష్మణచాంద: ఉపాధి కూలీలు జాబ్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఏపీడీ వోస ప్రసాద్ సూచించారు. మండలంలోని కనకాపూర్, బాబాపూర్, నర్సాపూర్, బోరిగాం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బంది సూచించిన విధంగా పనులు చేయాలని తెలిపారు. జాబ్ కార్డులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవడంతోపాటు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచేందుకు సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీవో ప్రమీల, టీసీ దినేష్, నారాయణ, ఎఫ్ఏలు ఉన్నారు.

ఆర్జీయూకేటీ సీఐగా రాకేశ్

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీ సీఐగా రాకేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సీఐగా చేసిన రవీందర్‌నాయక్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాకేశ్‌ను నియమించగా బాధ్యతలు స్వీకరించారు.

ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

భైంసాటౌన్:భైంసా పట్టణంలో ఎలాంటి అర్హత, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న అశ్విని స్కిన్ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ మంగళవారం సీజ్ చేశారు. ధన్‌రాజ్ అనే వ్యక్తి స్కిన్ స్పెషలిస్ట్‌గా చెలామణి అవుతూ వైద్యార్హతలు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నాడని ఫిర్యాదులు అందడంతో తనిఖీ చేసి సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

'సార్' బిడ్డనే మళ్లీ టాపర్..

- సర్కార్ కాలేజీలో చదువుల తల్లి..
- బైపీసీలో స్టేట్ మూడో ర్యాంక్..



తల్లిదండ్రులతో భవాని హాసిని

నిర్మల్ రూరల్: ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లలేదు. ఏ కార్పొరేట్ కాలేజీ మెట్లు ఎక్కలేదు. కనీసం ఉన్న ఊళ్లో ప్రైవేట్ కాలేజీల వైపు అడుగేయలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తండ్రి ప్రోత్సాహంతో స్థానికంగా ఉన్న సర్కారు కళాశాలలోనే చదువుకుంది. ఎక్కడ చదువుకుంటున్నామన్నది కాదు.. ఏం చదువుతున్నామన్నదే ముఖ్యం అనేలా సత్తా చాటింది. ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో ఏకంగా రాష్ట్రస్థాయిలోనే మూడో ర్యాంక్ సాధించింది. చదువుల తల్లి కొలువైన నిర్మల్ పేరును సగర్వంగా నిలిపింది జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివేకానందస్వామి, భవాని ధనలక్ష్మి దంపతుల కుమార్తె భవానీ హాసిని. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో చరిత్ర సష్టించింది. సర్కారు కళాశాల స్థాయిని కార్పొరేట్‌కు దీటుగా తీసుకెళ్లింది.

ప్రభుత్వ కళాశాలలోనే....

ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబాలు కూడా సర్కారు కాలేజీలవైపు చూడటం లేదు. తమ పిల్లలు ఉన్నతంగా ఎదగాలన్న ఉద్దేశంతో కార్పొరేట్ కాలేజీలవైపు పరుగులు తీస్తున్నారు. లక్షల రూపాయల ఫీజులు చెల్లిస్తూ హైదరాబాద్‌లో చదివిస్తున్నారు. అలాంటిది తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడైనప్పటికీ హాసిని ప్రైవేటు వైపు మొగ్గుచూపలేదు. తండ్రి మార్గదర్శనంలో కార్పొరేట్‌వైపు కాకుండా సర్కారు కళాశాలలోకే అడుగుపెట్టింది. 8వ తరగతి వరకు ఆదిలాబాద్‌లో చదివిన హాసిని 9, 10 తరగతులను స్థానిక సెయింట్ థామస్ స్కూల్లో పూర్తిచేసింది. స్నేహితులందరూ వివిధ కళాశాలలకు వెళ్లినా తాను మాత్రం ఇంటర్ కోసం 2021లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీలో చేరింది. కళాశాలలో గురువుల మార్గదర్శనం, ఇంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మొదటి సంవత్సరంలోనే 440 మార్కులకు 436 సాధించి సత్తా చాటింది. సెకండియర్‌లోనూ మరింత ఉత్తమ ప్రతిభను చాటుతూ 560 మార్కులకు 551 మార్కులను సాధించింది. మొత్తంగా ఇంటర్‌లో 987 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సొంతం చేసుకుంది.

డాక్టర్ కావాలని..



ప్రభుత్వ కళాశాలలో చదివినా అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఈస్థాయి మార్కులను సాధించాను. పరీక్షల సమయంలోనూ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా అధ్యాపకుల సూచనల మేరకు పరీక్షలు రాశాను. డాక్టర్ కావాలన్న లక్ష్యంతోనే బైపీసీ తీసుకున్నాను. రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంతోపాటు ఉత్తమ మార్కులు రావడం వెనుక మా అమ్మానాన్న, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకుల ప్రోత్సాహం ఉంది. – భవాని హాసిని

మహిళా ఆరోగ్యకేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కుంట ఏరియాలోని ఆరోగ్యకేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్:మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని కుంట ఏరియాలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్యకేంద్రంతోపాటు పురాణబజార్‌లోని కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ మంగళవారం అందించే వైద్యసేవలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఓపీతోపాటు క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్, సూక్ష్మపోషక లోపాలు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్స్, పీసీవోడీ తదితర వైద్యసేవలను వినియోగించుకునేలా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఎమ్మెల్యే రేఖానాయక్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని మస్కాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, పుప్పాల స్వప్న, అంకం రాజేందర్, పుప్పాల శంకర్, వెంకాగౌడ్, శ్రీనివాస్, గణేశ్, ప్రదీప్, చిన్నరాజన్న పాల్గొన్నారు.

సోన్: న్యూవెల్మల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ గారి రాజేందర్ ప్రారంభించారు. ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు సాయన్న, దయాకర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మొయినొద్దీన్, శ్రీనివాస్, నర్సయ్య, పాల్గొన్నారు.

లక్ష్మణచాంద:మండలంలోని వడ్యాల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ప్రారంభించారు.

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్, హవర్గ, కిష్టాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భుజంగ్‌రావు, గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, కపిల్, నరహరి, సుధీర్‌రెడ్డి, సాయారెడ్డి, ప్రశాంత్, సీఈవో చిన్నయ్య పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం



నిర్మల్‌రూరల్ మండలంలో నేలవాలిన వరి



కుంటాలలో వర్షానికి తడవకుండా ముందు జాగ్రత్తగా టార్పాలిన్‌లు కప్పుతున్న రైతులు

నిర్మల్:జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో మంగళవారం బలమైన ఈదురుగాలులతో వర్షం కురిసింది. నిర్మల్‌రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట నేలవాలింది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వాతావరణం మారడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యంపై టార్పాలిన్లు కప్పేశారు. ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జిల్లాకేంద్రంలో దుమ్ము ధూళితో రోడ్లపై వెళ్లే వాహనదారులు దాదాపు గంటపాటు ఇబ్బంది పడ్డారు. రెండురోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో మండిపోయిన జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారడంతో కాస్త చల్లబడింది.

కుంటాల మండలంలో వర్షం

కుంటాల: మండంలోని అందకూర్, కల్లూర్, రాయపాడ్ తండాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. దీంతో చేలల్లో నూర్పిడికి సిద్ధంగా ఉంచిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మక్కలు తడవకుండా రైతులు టార్పాలిన్‌లు కప్పి ఉంచారు.

యువతకు ఆదర్శప్రాయుడు మహారాణా ప్రతాప్‌సింగ్



మహారాణా ప్రతాప్ సింగ్ కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్:నేటి యువతకు వీరశిరోమణి మహారాణా ప్రతాప్‌సింగ్ ఆదర్శప్రాయుడని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన మహారాణా ప్రతాప్ సింగ్ 483వ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మినీ ట్యాంక్ బండ్ మహారాణా ప్రతాప్‌సింగ్ ఘాట్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పోరాట యోధున్ని ఆదర్శంగా తీసుకుని, ఆయన సాధించిన విజయాలను, సేవలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, గండ్రత్ రమణ, రాజ్‌పుత్ సమాజ్ అధ్యక్షుడు ఠాగూర్ లక్ష్మణ్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు గజేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు అనిల్‌సింగ్, సెక్రటరీ నరేందర్ సింగ్, నారాయణ్ సింగ్, విశాల్ సింగ్, చందూలాల్, కిషన్ సింగ్, హీరాసింగ్, సాయిసింగ్, హనుమాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏసీ రాంబాబు

లక్ష్మణచాంద:అన్ని గ్రామాల్లో నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. లక్ష్మణచాంద, పీచర, చామన్‌పెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. వరి పంటకు ఈసారి ఎక్కువగా తెగుళ్లు వచ్చాయని దీంతో ధాన్యంలో తాలు, తప్ప లేకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. వాతావరణంలో మార్పులు వస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అవసరమైతే హమాలీల సంఖ్య పెంచుకోవాలని సూచించారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని తెలిపారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ డీఎం శ్రీకళ, తహసీల్దార్ కవితారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్ ఉన్నారు.

బాలల హక్కులు పరిరక్షిద్దాం

లక్ష్మణచాంద:బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని డీసీపీవో మురళి కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణను బాధ్యతగా భావించాలన్నారు. బాలలకు ఇబ్బంది కలిగితే 1098కు కాల్ చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు గ్రామాల పెద్దలు, మత పెద్దలు, వీడీసీ సభ్యులు చొరవ చూపాలని సూచించారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వరల్డ్ విజన్ కోఆర్డినేటర్ బ్రహ్మన్న పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పట్టపగలే చీకట్లు







ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం మిట్ట మధ్యాహ్నం కరెంట్ లేకపోవడంతో వార్డులన్నీ చీకట్లు అలుముకున్నాయి. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. చిన్నారుల ఉపశమనం కోసం వారి పోషకులు గాలి ఊపుతూ కనిపించారు. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ దానిని ఆన్ చేయకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఓ మహిళ కడెం మండలం నుంచి పురుటినొప్పులతో డెలివరీ కోసం రాగా కరెంటు లేకపోవడంతో ఆమెను పట్టించుకునేవారే కానరాలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న విజయ్‌సారథి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రాంత గర్భిణులకు, బాలింతలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ పీవో ఎంసీహెచ్ విజయ్‌సారథి అన్నారు. మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయ్‌కుమార్‌తో కలిసి కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు చెందిన దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్, పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య రక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహా సూచనలు అందించారు. సమావేశంలో వైద్యాధికారులు సందీప్, అనురాధ, విజయ, ప్రతాప్‌నాయక్, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీటీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి, యూజీ స్థాయిలో ఆయా సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత, అనుభవమున్న ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, సెట్/నెట్/పీహెచ్‌డీ కలిగి కనీసం రెండు సంవత్సరాల బోధన అనుభవం కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.ttwrdcr.ac.in వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు. ఈ నెల 16 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



- మార్కులు, ర్యాంకులే కొలమానం కాదు..
- ప్రముఖులెందరో చదువుల్లో పరాజితులే
- కఠిన నిర్ణయాలు సబబు కాదంటున్న మానసిక నిపుణులు

నిర్మల్‌ఖిల్లా: జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. మరి ఎందుకు చదువుకోవాలి.. దాని పరమార్థం ఏమిటి? మన జీవితంలో చదువు, కెరీర్‌ల పాత్ర ఏమిటి? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవాళ్లేనా? ... పలు పరీక్షా ఫలితాల నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

ఒత్తిడే కారణం..
ఇంటర్, పదో తరగతి, నీట్, ఎంసెట్, ఐఐటీ, పోటీ పరీక్షలు ఏవైనా ఫలితాల సమయంలో ఒత్తిడి సహజం. వీటి ప్రభావంతో తీసుకున్న కఠిన నిర్ణయాలైన ఆత్మహత్యలు అప్పుడప్పుడూ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్యూర్‌ను విద్యార్థులు భరించలేకపోవడం దీనికి ముఖ్యకారణం. ఇంటి నుంచే కాకుండా.. సమాజం నుంచి కూడా వచ్చే ఒత్తిడి దీనికి కారణమని మానసిక నిపుణులు అంటున్నారు.

చదువు తెలివితేటల కోసమే..
తల్లిదండ్రులు తిడతారని ఒకరు.. స్నేహితుల వద్ద తలెత్తుకులేమని ఇంకొకరు.. సమాజంలో పరువు పోతుందని మరొకరు.. ఇలా ఏదో కారణంతో విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చదువులో వెనకబడి ఉండి కూడా జీవితంలో ఊహించని సక్సెస్ అందుకున్న వాళ్లు కోకొల్లలు. డిగ్రీ పట్టా లేకపోయినా వివిధ రంగాల్లో అసమాన్య ప్రతిభ కనబర్చినవారు బోలెడుమంది ఉన్నారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయితే అదేం జీవితంలో ఫెయిల్ అయినట్టు కాదు. విద్యార్థులకు మరో అవకాశం ఉంటుంది. సప్లిమెంటరీలు రాసి మళ్లీ పాస్ కావచ్చు. క్రీడలు, సినిమా, బిజినెస్ లాంటి పలురంగాల్లో అవకాశాలు చాలా ఉన్నాయి. చదువు నిన్ను అవగాహన పరంగా మరో మెట్టు ఎక్కించడానికి మాత్రమే. చదువులో ఫెయిల్ అయితే బతుకులో ఫెయిల్ అయినట్టు కాదు. సరిగ్గా అనుకుంటే చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించవచ్చు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన అలాంటి వ్యక్తుల ఉదాహరణలు మచ్చుకు కొన్ని....

కమల్‌హాసన్.. సినీనటుడు



నటనలో యావత్ భారతాన్ని ఒక్క ఊపు ఊపిన వారిలో కమల్‌హాసన్ ఒకరు. ఆయన చిన్నప్పుడు స్కూల్ డ్రాప్ అవుట్. పదో తరగతి కూడా చదవలేదు. అయితే నేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, రాయటం, చదవడంపై పట్టుసాధించాడు. కమల్‌హాసన్ నటుడు మాత్రమేకాదు రచయిత, డైరెక్టర్, ప్రొడ్యుసర్, ప్లేబ్యాక్ సింగర్.. మల్టీటాలెంటెడ్ స్టార్‌గా ఎదిగాడు.

మహేంద్రసింగ్ ధోని.. క్రికెట్ ఆటగాడు



మనదేశ ప్రఖ్యాత క్రికెటర్లలో ఒకరైన మహేంద్ర సింగ్ ధోనికి తన చిన్నతనంలో చదువు పట్ల పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. చిన్నప్పుడు బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆటలు ఆడేవాడు. ధోనీ గోల్ కీపర్‌గా ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు, అతడి కోచ్ అతడిని స్థానిక క్రికెట్ క్లబ్‌లో వికెట్ కీపర్‌గా ఆడటానికి ఎంపిక చేశాడు. కాలక్రమేణా క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ధోని కుటుంబాన్ని పోషించుకోవడానికి రైలు టిక్కెట్ ఎగ్జామినర్‌గా పనిచేశాడు. 2004లో భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎదిగి ఎన్నో రికార్డులను సాధించాడు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు



క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. స్థిరంగా ఆలోచించుకోవాలి. మార్కులు, ర్యాంకులు కొలమానం కాదు. చదువుల్లో రాణించని ఎందరో ప్రముఖులు తాము ఎంచుకున్న ప్రత్యామ్నాయ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి. మానసికంగా దృఢంగా ఉండేలా విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులే మార్గనిర్దేశనం చేయాలి - **మొత్కురి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్**

ఎంతోమంది..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఎంటర్‌ప్రెన్యూర్ నారాయణ మూర్తి, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఎయిర్ డెక్కన్ కెప్టెన్ గోపినాథ్, వరల్డ్ చాంపియన్ సుశీల్ వ్యాపార వేత్త సుభాష్‌చంద్ర గోయెంకా వీరందరి ప్రయాణం ఉన్నత చదువులతో ప్రారంభం అవ్వలేదు. అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొని కష్టపడి ఎదిగినవాళ్లు. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, పదిలో ఫెయిల్ అయ్యారని తనువు చాలించాలనే నిర్ణయానికి రావడం సబబేనా.. ఓ సారి ఆలోచించండి..



వ్యాపార వేత్త సుభాష్ చంద్ర గోయెంకా

ఆత్మవిశ్వాసం ఉంటే చాలు...



దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన డాక్టర్ వెల్మల మధు ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వేలాది మంది పోటీ పడిన డీఎల్ పరీక్షలో ఆయన ఎందర్నో వెనక్కినెట్టి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయన ఒకప్పుడు ఇంటర్‌లో పరీక్ష తప్పాడు. డిగ్రీలోనూ అంతే ముందుకెళ్లలేకపోయాడు. తనవల్ల కాదని ప్రయివేటులో చిన్నాచితక ఉద్యోగాలు చేస్తూ పోయాడు. కొన్నేళ్ల తర్వాత తనమిత్రులను చూసి స్ఫూర్తిని పొందాడు. ఆగిన చదువును పట్టాలెక్కించి డిగ్రీ నుంచి వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందేదాకా ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. ప్రస్తుతం వివిధ అంశాలలో ప్రావీణ్యం సంపాదించి అనేక పరిశోధన పత్రాలను, అంతర్జాతీయ స్థాయిలో సమర్పిస్తూ రాణిస్తున్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



సెల్‌ఫోన్లను బాధితులకు అందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌లను రికవరీ చేయడం జరుగుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు మంగళవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన వెంటనే దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వ్యక్తిగతంగా కూడా అభ్యర్థనను అందించిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నారాయణ, జై జవాన్ నగర్‌కు చెందిన ఎం. అనిత, మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పర్వీజ్ సుల్తానా, రాంనగర్‌కు చెందిన గంగారెడ్డి, తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణలు గతంలో వివిధ కారణాలతో ఫోన్‌లు పోగొట్టుకోగా ఈ వెబ్‌సైట్ ద్వారా వాటిని స్వాధీనం చేసుకుని అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, బి.రాములు నాయక్, సీఐ ఈ చంద్రమౌళి, సైబర్ సెల్ సిబ్బంది సింగజ్వార్ సంజీవ్ కుమార్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన గొడిసెల వెంకటేష్ (65) అప్పులబాధతో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. వెంకటేష్ స్థానికంగా బీడీ కంపెనీ నడుపుకుంటూ నిర్మల్‌లో చిన్న టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. టిఫిన్ సెంటర్ నిర్వాహణ, బీడీ కంపెనీ లైసెన్స్ తీసుకోవడానికి సుమారు 4 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో పాటు అతడి తలలో పెద్ద కణతి ఏర్పడగా వైద్యం కోసం సైతం గ్రామంలో పలువురి వద్ద అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇందిర, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో గేదెదూడ మృతి

కుంటాల: పిచ్చికుక్కల దాడిలో మండల కేంద్రంలోని నాలకంటి గంగాధర్‌కు చెందిన గేదెదూడ మంగళవారం చనిపోయింది. ఇంటి ముందర కట్టేసి ఉంచిన గేదె దూడపై గుంపులుగా వచ్చిన కుక్కలు దాడిచేసి హతమార్చాయి. గతంలో ఒక గేదె, గొర్రెపిలపై పిచ్చికుక్కలు దాడి చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజబాపుకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాధిత రైతు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెల్లడించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: అతివేగంగా కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన మహారాష్ట్రకు చెందిన కారు డ్రైవర్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడ ఖానాపూర్‌కు చెందిన అల్తాఫ్‌ఖాన్ ఈ నెల 3న తన భార్య, కూతురుతో కలిసి పట్టణంలోని బసవేశ్వరచౌక్ వద్ద రోడ్డు దాటుతుండగా బస్టాండ్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అల్తాఫ్‌ఖాన్‌తో పాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

దొంగతనానికి యత్నం.. పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు పట్టుకున్న దొంగ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో మంగళవారం ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నించగా గ్రామస్తులకు దొరికిపోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామంలో ఒంటరిగా అపరిచిత వ్యక్తి తిరుగుతున్నట్లుగా గ్రామస్తులు గుర్తించారు. మధ్యాహ్నం సమయంలో గ్రామంలో ఎవరు లేని ఇంట్లోకి చొరబడి దొంగతనం చేయడానికి యత్నించాడు. అదే సమయంలో ఇంటి సంబంధించిన వారు రావడంతో దొంగను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలి

- టీఎస్ఎంఎస్ఐడీసీ జీఎంకు రూపేశ్‌రెడ్డి వినతి



జీఎం రాంబాబు నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రూపేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో రూ.150 కోట్లతో నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ సర్వీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) జీ.ఎం. రాంబాబు నాయక్‌ను యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రిని నిర్మించారని, అందులో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సౌకర్యం లేకపోవడంతో జిల్లా ప్రజలు రూ.వేలల్లో ఖర్చు చేసి హైదరాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు స్కానింగ్ కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు ఎంఆర్ఐ స్కానింగ్ లేదన్నారు. ఇప్పటికైనా స్కానింగ్ ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు దూరం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జీఎం త్వరలో స్కానింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకులాల హవా

- ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 4, 5వ ర్యాంక్‌లు
- విద్యార్థినులను అభినందించిన ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి



టి.వర్షిత



సీహెచ్ సుధారాణి

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 13కళాశాలల్లో 95.27శాతం, మొదటి సంవత్సరంలో 85.12శాతం ఫలితాలు సాధించినట్లు ఆర్సీవో గంగాధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీలో టి.వర్షిత (ఉట్నూర్ కళాశాల) 946 మార్కులు, సీహెచ్ సుధారాణి (ఆసిఫాబాద్ కళాశాల) 945 మార్కులతో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో 4వ, 5వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ గురుకులానికి చెందిన ఆర్.కార్తీక 458 మార్కులతో బైపీసీలో రాష్ట్రంలోనే 2వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపాడు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఇంద్రవెల్లి, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్ బాలికల జూనియర్ కళాశాల 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 1117 మందికి 1068 మంది ఉత్తీర్ణత సాధించగా 49 మంది ఫెయిలైనట్లు తెలిపాడు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 1279 మందికి 1104 మంది ఉత్తీర్ణులు కాగా 175 మంది అనుత్తీర్ణులైనట్లు పేర్కొన్నాడు. సెకండ్ ఇయర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4, 5వ ర్యాంక్ సాధించిన వర్షిత, సీహెచ్ సుధారాణి, 2వ ర్యాంకు సాధించిన ఆర్.కార్తీకను ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, ఆర్సీవో వి.గంగాధర్ అభినందించారు.

చెన్నై జాతీయ సమైక్య శిబిరానికి ఎంపిక



సాయినాథ్



శివమణి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కెడేట్స్ మాడవి శివమణి, భాస్కరోల్ల సాయినాథ్ చెన్నైలో జరిగే పది రోజుల ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ సమైక్య శిబిరానికి వీరిద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కెడేట్స్ తమ రాష్ట్రాలకు సంబంధించిన సంస్కృతి సంప్రదాయాలను ఇతరులకు వివరిస్తారని, అక్కడి సంస్కృతి సంప్రదాయాలను నేర్చుకుంటారని వివరించారు. బోథ్ మండలంలోని మారుమూల గ్రామమైన కంటేగాం గ్రామానికి చెందిన మాడవి శివమణి, ముథోల్ ప్రాంతానికి చెందిన సాయినాథ్ ప్రస్తుతం బీజెడ్‌సి రెండో సంవత్సరం చదువుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

దస్తురాబాద్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నిర్మల్ ఆర్డీవో స్రవంతి అన్నారు. మంగళవారం దస్తురాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించి మాట్లాడారు. ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మంజూరైన నూతన పెట్రోల్‌బంక్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐలు గంగన్న, వెంకటనర్సయ్య, తదితరులు ఉన్నారు.